# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు

శనివారం | 20 |జూన్ | 2026 | పేజీలు: 11


## దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి కందుల



3 లో



## ఆకాంక్షల సాధనలో...
# ఆదర్శంగా టీమ్ ఎన్టీఆర్

పి.మీరాహుస్సేన్ ఖాన్

- ప్రగతి పథంలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాకులు
- లక్ష్యాల సాధనలో జిల్లా యంత్రాంగం కృషికి ప్రభారీ అధికారి ప్రశంసలు
- అన్నింటా 100 శాతం ప్రగతికి గొప్ప ముందడుగున్న నేలపట్ల అశోక్‌బాబు
- రైజ్, జీకేపీకే, ఇగ్నైట్ వంటి వినూత్న కార్యక్రమాలు వికాసానికి పునాదులన్న ప్రభారీ అధికారి

-విజయవాడ, మనంబ్యూరో

3 లో

## ఇంద్రకీలాద్రిపై ఈఓ విస్తృత తనిఖీలు

4 లో





## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుంటుంది

5 లో

# యోగా మహా... సన్నాహం

3 లో

ఏర్పాట్లను పరిశీలించిన వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం





# ప్రజల నమ్మకాన్ని నిజం చేస్తున్న కూటమి ప్రభుత్వం

**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో నమ్మకం**
**అభివృద్ధి సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా రాష్ట్రం**
**రాష్ట్రంలో రెండేళ్ల కూటమి ప్రభుత్వంపై నమ్మకం**
**జగ్గయ్యపేటలో అభివృద్ధి, సంక్షేమం జయోత్సవ సభ లో నెట్టెం రఘురాం ,ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్**

**జగ్గయ్యపేట జూన్ 19 మనం న్యూస్:** ప్రజలు నమ్మకాన్ని నిజం చేస్తూ కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమం దిశగా పరుగులుడుతోందని మాజీ మంత్రి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట శాసనసభ్యులు పొలిటి బ్యూరో సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ లు అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని ఉక్కు కళా వేదికలో శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ , ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ బైక్ ర్యాలీతో విజయోత్సవ సభకు శ్రీకారం

విజయోత్సవ సభకు ముందు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నివాసం వద్ద నుండి యువనాయకులు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు) ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వందలాది వాహనాలతో ఉత్సాహంగా పాల్గొని పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉక్కు కళా వేదికకు చేరుకుని విజయోత్సవ సభను ప్రారంభించారు.

## రెండేళ్ల విజయోత్సవ సభలో నేతలు మాట్లాడుతూ...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధితో పనిచేస్తూ అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని పురోగతి దిశగా నడిపిస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు



చేస్తోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్లను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచడం, దివ్యాంగుల పింఛన్లను రూ.6,000కు పెంచడం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, రైతులకు ఉచిత ఇసుక విధానం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు దిశగా చర్యలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యా మరియు వైద్య రంగాల బలోపేతం వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. అదేవిధంగా జగ్గయ్యపేట నియోజకవర్గానికి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అందించిన అభివృద్ధి, సంక్షేమ నిధుల వివరాలను సభలో ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖల ద్వారా మొత్తం రూ.313.96 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయబడినట్లు తెలిపారు. ఈ క్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, మురుగు డ్రెయిన్ల నిర్మాణానికి రూ.20 కోట్లు, జిల్లా మైనింగ్ ఫండ్ ద్వారా అభివృద్ధి పనులకు రూ.21 కోట్లు, నాబార్డ్ నిధులతో గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.2.70 కోట్లు, గ్రామీణ తాగునీటి మరియు సీపీడబ్ల్యూఎస్ పథకాలకు రూ.17.55 కోట్లు, రోడ్లు మరియు భవనాల శాఖ ద్వారా బ్రిడ్జిలు, రోడ్లు, డ్రైనేజీలు, రిటైనింగ్ వాల్స్ మరియు ఇతర పనులకు రూ.26.50 కోట్లు, దేవాదాయ శాఖ ద్వారా ఆలయాల అభివృద్ధికి రూ.1.85 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. అలాగే మున్సిపాలిటీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 1,400 రింగు బండ్లు మరియు 146 ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు రూ.16.70 కోట్లు, సాగునీటి శాఖ ద్వారా ఆనకట్టల అభివృద్ధి, ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్లు, చెరువుల అభివృద్ధికి రూ.11.75 కోట్లు, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 194 గోకులాల నిర్మాణానికి రూ.3.88 కోట్లు, రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీకి రూ.0.76 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంకా అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీల తాగునీటి సరఫరా అభివృద్ధికి రూ.14.27 కోట్లు, యువజనులకు పట్టణ ప్రాంతాల్లో శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు రూ.77 లక్షలు, అలాగే వివిధ సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను కూడా ఎమ్మెల్యే తాతయ్య వివరించారు. సామాజిక భద్రతా పింఛన్ల పెంపుతో వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని, మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే కార్యక్రమం ప్రారంభించామని, అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే అల్పాహారం మరియు భోజనం అందిస్తున్నామని తెలిపారు. అలాగే తల్లికి వందనం పథకం కింద అర్హులైన విద్యార్థుల తల్లులకు రూ.15,000 చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు గారు, నూకల కుమార్ రాజా, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య, మేక వెంకటేశ్వర్లు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, కట్టా వెంకట నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, క్రి చిన్న, కన్నెబోయిన రామలక్ష్మి, ధూళిపాళ్ల లక్ష్మణరావు, వేగినేటి గోపాలకృష్ణ, మన్నె శ్రీనివాసరావు, పొన్నం బాలాజీ, కానూరి కిషోర్, గింజుపల్లి వెంకటరావు, జిల్లేపల్లి సుధీర్ బాబు, నల్లమోలు శివరామకృష్ణ ప్రసాద్, గుమ్మ వెంకటేష్, చిలుకూరి శిరీష, షేక్ అక్బర్, ఇస్లావతు శ్రీను నాయక్, షేక్ మోసిన్, సయ్యద్ అన్వర్, లాహోరి కుసుమలత, కౌన్సిలర్లు గొట్టే నాగరాజు, సంగేపు బుజ్జిబాబు, వేదలాపురి అలేఖ్య, మండల సమైక్య అధ్యక్షులు నాయిని రజిని, కర్ల కోటేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు. వివిధ హోదాల్లో ఉన్న కూటమి పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను కొనియాడారు.

# మాజీ చీఫ్ జస్టిస్ వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలిసిన నెట్టెం రఘురాం



**జగ్గయ్యపేటజూన్ 19 మనం న్యూస్:** సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ను కేడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం మర్యాదపూర్వకంగా కలిశారు.శుక్రవారం పొన్నవరం గ్రామంలో భారత దేశ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ తమ స్వగృహానికి విచ్చేసిన సందర్భంగా, మాజీ మంత్రి మరియు కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా పలకరించారు.ఈ సందర్భంగా వారిద్దరి మధ్య గతంలో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని స్మరించుకుంటూ, కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవలు, బ్యాంకు సాధించిన ప్రగతి, చేపడుతున్న వినూత్న కార్యక్రమాల విశేషాలను నెట్టెం శ్రీ రఘురాం, వెంకటరమణ తో పంచుకున్నారు.

# కారుమూరి సతీష్ అరెస్టు బాధాకరం

**ఆంధ్రప్రదేశ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోను నరేష్**

**గాంధీ నగర్ జూన్ 19 మనం న్యూస్:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ ప్రెసిడెంట్ బోను దుర్గా నరేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు..ఎటువంటి కుంభకోణంలో సంబంధం లేని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ ను ఇబ్బందులకు గురిచేసి అరెస్ట్ చేయడం సమంజసం కాదని,బీసీలపై ఇదేవిధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తే త్వరలోనే ప్రభుత్వానికి చరమగీతం పాడతామని హెచ్చరించారు... విజయవాడలోనీ తన నివాసం నందు ఆంధ్రప్రదేశ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ ప్రెసిడెంట్ బోను దుర్గా నరేష్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలే లక్ష్యంగా అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని,. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతూ రెడ్బుక్ రాజ్యాంగ అమలు చేస్తుందని మండిపడ్డారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ ను అన్యాయంగా అరెస్టు చేశారని దానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. లిక్కర్ కుంభకోణం కేసులో సునీల్ కు హైదరాబాదు నగరంలో పోలీసులు నోటీసులు ఇచ్చిన వెంటనే అరెస్ట్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు..లాభాన్ని ఆశించి ఎవరైనా వ్యాపారం చేయడం సహజమని, అయితే సునీల్ అకౌంట్ నుండి సబ్ కాంట్రాక్టర్ కు కొంత అమౌంట్ ట్రాన్స్ఫర్ చేయడం జరిగిందని మరలా అతను తిరిగి వచ్చిన లాభంతో సునీల్ అకౌంట్ కు జమ చేయడం జరిగిందని వివరించారు. లిక్కర్ కుంభకోణానికి మాజీ మంత్రి కారుమూరి



నాగేశ్వరరావు కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని కూటమి ప్రభుత్వం కావాలనే వారిని ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. బీసీలు వ్యాపారాలు చేయకూడదా ఆర్థికంగా ఎదగకూడదా రాజకీయాలలో రాణించకూడదా అని ఆయన కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న అక్రమ అరెస్టులను అదేవిధంగా బీసీలపై జరుగుతున్న దాడులను కూటమి ప్రభుత్వం ఆపకపోతే త్వరలోనే కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడుతామని హెచ్చరించారు..




## ఆకాంక్షల సాధనలో ఆదర్శంగా

# టీమ్ ఎన్టీఆర్

**ప్రగతి పథంలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాకులు**
**లక్ష్యాల సాధనలో జిల్లా యంత్రాంగం కృషికి ప్రభారీ అధికారి ప్రశంసలు**
**అన్నింటా 100 శాతం ప్రగతికి గొప్ప ముందడుగున్న నేలపట్ల అశోక్‌బాబు**
**రైజ్, జీకేపీకే, ఇగ్నైట్ వంటి వినూత్న కార్యక్రమాలు వికాసానికి పునాదులన్న ప్రభారీ అధికారి**

(విజయవాడ, మనం బ్యూరో): సామాజిక, ఆర్థిక, మానవాభివృద్ధిలో సమానత, సమ్మిళిత లక్ష్యంగా అమలవుతున్న ఆకాంక్షిత మండలాల కార్యక్రమం అమల్లో ఎన్టీఆర్ జిల్లా టీమ్ సమష్టి కృషి కారణంగా ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో స్పష్టమైన అభివృద్ధి నమోదైందని జిల్లా ప్రభారీ అధికారి, నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్బాబు అన్నారు. లక్ష్యాల సాధనలో జిల్లా యంత్రాంగం చేసిన కృషిని ప్రశంసించారు.ప్రభారీ అధికారి అశోక్బాబు ఈ నెల 17, 18 తేదీల్లో పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటించారు. వ్యవసాయ క్షేత్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్లు తదితరాలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి సూచికల్లో ప్రగతిని పరిశీలించారు. శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో విద్య, వైద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా, డీఆర్డీఏ, పశుసంవర్ధక, వ్యవసాయం తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నేలపట్ల అశోక్బాబు.. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. 2023, జనవరి 7న దేశ వ్యాప్తంగా ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం (ఏబీపీ) ప్రారంభం కాగా మొత్తం 513 బ్లాకులను గుర్తించగా మన జిల్లాలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలులో కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ బ్లాకుల్లో విద్య, వైద్య ఆరోగ్యం, వ్యవసాయ, అనుబంధరంగాలు, మహిళా శిశు సంక్షేమం తదితరాల్లో వివిధ సూచికల పురోగతిని కలెక్టర్ లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సంపూర్ణత అభియాన్ - 1 కింద ఆరు సూచికల్లో 100 శాతం ప్రగతిని నమోదుచేసి నీతి ఆయోగ్ నుంచి బంగారు పతకాలు అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా సంపూర్ణత అభియాన్ 2.0 కింద ఆరు సూచికల్లో 100 శాతం ప్రగతిని నమోదు చేసినట్లుగా వివరించారు. మొత్తం 38 సూచికల్లో పెనుగంచిప్రోలులో 27, ఇబ్రహీంపట్నంలో 25 సూచికల్లో 100 శాతం ప్రగతి లక్ష్యాన్ని చేరుకున్నామని, అన్ని సూచికల్లోనూ ఇదే రకమైన అభివృద్ధికి ప్రణాళికాయుత కృషిచేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పాటు ఆర్టీఐహెచ్, అలెప్, వికాస వంటి కార్యాలయాల సహాయ సహకారాలు కీలకంగా ఉంటున్నాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

### వికాసానికి వినూత్న కార్యక్రమాలు: ప్రభారీ అధికారి అశోక్‌బాబు

జిల్లా, మండలస్థాయి అధికారులు,బ్లాక్ కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, ఫ్రంట్లైన్ వర్కర్లు, నిబద్ధతతో పనిచేస్తూ లక్ష్యాలను చేరుకుంటున్నారని, వీరందరికీ నీతి ఆయోగ్ తరఫున అభినందనలు తెలియజేస్తున్నట్లు ప్రభారీ అధికారి అశోక్బాబు అన్నారు. రైజ్ (రూరల్ ఇన్క్యుబేషన్, స్కిలింగ్ ఎంటర్ప్రెన్యూరేషిప్), ఇగ్నైట్, ఏఐ ఫర్ ష్యూర్, ఎస్హెచ్జీ షార్క్ ట్యాంక్, స్మార్ట్ అగ్రికల్చర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (గ్రామీణ్ కృషి పరిజ్ఞాన కేంద్రం-జీకేపీకే) వంటి వినూత్న కార్యక్రమాలు జిల్లాలో కలెక్టర్ సారథ్యంలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. గత పర్యటన నాటికి ఈసారి పర్యటనకు రెండు బ్లాకుల్లో విశేష అభివృద్ధి కనిపించిందని.. ఇదే స్ఫూర్తితో అన్ని అంశాల్లోనూ 100 శాతం ప్రగతికి కృషిచేయాలన్నారు. ప్రధానంగా విద్య, వైద్య ఆరోగ్యం, పోషణ తదితర అంశాలపై దృష్టిసారించాలని అశోక్బాబు అన్నారు.సమావేశంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్, సీపీవో డీవీఎస్ఆర్ ప్రసాద్, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, డీఎంహెచ్వో డా. ఇందుమతి, డీఈవో ఎల్.చంద్రకళ, ఎంపీడీవోలు శకుంతల, శ్రీను, రామకృష్ణ నాయక్, ఇబ్రహీంపట్నం బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, పెనుగంచిప్రోలు బ్లాక్ కోఆర్డినేటర్ జి.మోహన్ సందీప్, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యోగా మహా సన్నాహం..

**▸▸ ఏర్పాట్లను పరిశీలించిన వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**▸▸ కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం**



(విజయవాడ,జూన్,19,మనం న్యూస్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వేడుకలకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి స్టేడియంలోని యోగా వేదిక, పాల్గొనేవారి కూర్చునే ప్రాంతాలు, పార్కింగ్, తాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలు, విద్యుత్ బ్యాకప్, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్య చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. 24 బ్లాకులతో పాటు ఏడు గ్యాలరీల వారీగా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి ప్రత్యేక అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఒక్కో బ్లాకు సామర్థ్యం 250 కాగా, గ్యాలరీ సామర్థ్యం 150 అని అధికారులు వివరించారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు బ్లాకు టీమ్లు ఏర్పాటు చేయడం జరిగిందని.. ఒక్కో టీమ్లో ఒక జిల్లా అధికారి, యోగా ట్రైనర్, మెడికల్ సిబ్బంది, మఫ్టీ పోలీసు సిబ్బంది, శానిటేషన్ సూపర్వైజర్, సిబ్బంది ఉంటారని వివరించారు. ప్రధాన వేదిక, కల్చరల్ వేదిక, యోగా డెమో వేదిక, ప్రధాన డిజిటల్ స్క్రీన్, గ్యాలరీల స్క్రీన్లు తదితరాలపైనా మంత్రి చర్చించారు. ప్రతి అంశంలోనూ ప్రణాళిక ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించాలన్నారు.



# విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి కందుల దుర్గేష్





(విజయవాడ,మనం బ్యూరో): ఇంద్రకీలాద్రిపై కొలువైన విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారిని, దుర్గా మల్లేశ్వర స్వామిని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటో గ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో, మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దుర్గేష్ అమ్మవారిని దర్శించుకుని, దేవేరి కృపాకటాక్షాల కోసం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించి, వేదాశీర్వచనం పలికారు. జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా మంత్రి ప్రార్థించారు. పూజా కార్యక్రమాల అనంతరం, ఇంద్రకీలాద్రిపై భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న వివిధ ఆధ్యాత్మిక, మౌలిక వసతుల అభివృద్ధి పనుల గురించి ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.


# చిరుమామిళ్ళ నారాయణ అద్వర్యంలో అయ్యప్పకు లక్ష మల్లెపూల అర్చన



**▸▸ అంగరంగా వైభవంగా అయ్యప్ప స్వామివారికి ప్రత్యేకంగా 21రకాల పూజా ద్రవ్యలతో పూజలు**

**▸▸ పెద్దెత్తున అయ్యప్పను దర్శించుకున్న భక్తులు**

నందిగామ,జూన్19(మనం న్యూస్): నందిగామ లోని చందాపురం రోడ్డు లో గల అయ్యప్ప స్వామి వారి దేవస్థానము నిర్మించి పదిహేను సంవత్సరాలు అయిన సందర్భముగా అయ్యప్ప స్వామి వారికి అంగరంగా వైభవముగా మొదటి సారి లక్ష మల్లెపూల అర్చన జరిగింది. శుక్రవారం ఉదయం 6.గంటలకు 21పూజ ద్రవ్యములతో అభిషేకం అనంతరం లక్ష మల్లెపూల అర్చన అనంతరం పంచామతములతో అభిషేకం జరిగింది. ఈ లక్ష





మల్లెపూల అర్చనకు అయిన మొత్తం ఖర్చు చిరుమామిళ్ల నారాయణ కుటుంబ సభ్యులు సహకారంతో జరిపించటం జరిగింది. ఈ సందర్భంగా చిరుమామిళ్ళ నారా మాట్లాడుతూ స్వామివారి కి లక్ష మల్లెల పూజ నిర్వహించడం తమ అదష్టమని అన్నారు. ఈ కార్యక్రమములో శాఖమూరి స్వర్ణలత, ముక్కపాటి నాగయ్య,గాట్ల గజేంద్ర, చేరుకూరి శ్రీనివాసరావు,నల్లని అయ్యన్న,పూసాని మోహనరావు,కొమ్మినేని సుబ్బారావు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో యోగాంధ్ర కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**91549 70454 నంబర్తో 24 గంటలూ అందుబాటులో సేవలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,జూన్,19,(మనం న్యూస్)॰ ఈ నెల 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, డా. బీఆర్ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నేపథ్యంలో కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందించేందుకు కలెక్టరేట్లో ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందని, ప్రజలు 91549 70454 నంబర్ను సంప్రదించి యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చన్నారు. రెవెన్యూ, పోలీసు, మునిసిపల్ తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కంట్రోల్ రూమ్లో నిరంతరం అందుబాటులో ఉండి సమన్వయంతో సేవలు అందిస్తారని తెలిపారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



**గద్దె రామమోహన్**

విజయవాడ తూర్పు జూన్ 19( మనం న్యూస్)॰ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. పటమట అశోక్నగర్లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్లో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాదర్బార్లో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరిస్తుండగా, నిధులు అవసరమయ్యే అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో గాదె సాయికృష్ణ మిస్సింగ్ వ్యవహారం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా గద్దె రామమోహన్ మాట్లాడుతూ సాయికృష్ణ అంశంపై వైఎస్సార్సీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఫొటోలు సాయికృష్ణవికావని, అవి నవీన్కు సంబంధించినవని పోలీసులు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దె క్రాంతికుమార్, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, పెనుగొండ శ్రీను, పీరుబాబు, పొట్లూరు రవీంద్ర, గోగుల యేసు, సోము తదితరులు పాల్గొన్నారు.

# ధరలు తగ్గించాలంటూ నిరసన




విజయవాడ సెంట్రల్ జూన్ 19 (మనం న్యూస్)॰ పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ మురా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో గూడ్స్ ఆటోలతో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. వందలాది ఆటోలు బ్యానర్లు, జెండాలతో ర్యాలీలో పాల్గొన్నాయి.ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, సీఐటీయూ నాయకులు డి.కాశీనాథ్, కె.దుర్గారావు మద్దతు తెలిపారు. అనంతరం యూనియన్ కార్యదర్శి ఎం.సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు నాయకులు ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకపోవడం ప్రజలపై అదనపు భారం మోపడమేనని విమర్శించారు. పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.డీజిల్ ధరల పెరుగుదలతో మురా, ఆటో కార్మికులపై నెలకు వేల రూపాయల అదనపు భారం పడుతోందని, అదే సమయంలో వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు తగ్గించి ధరలను నియంత్రించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మురా కార్మికులు, ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఈఓ విస్తృత తనిఖీలు



**భక్తుల సౌకర్యాల మెరుగుదలకు కీలక ఆదేశాలు**


విజయవాడ ఇంద్రకీలాద్రి , జూన్ 19 (మనం న్యూస్)॰ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించిన దేవస్థానం ఈఓ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వి.కె. సీనా నాయక్ శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇంజినీరింగ్, పరిపాలన, భద్రతా విభాగాల అధికారులతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు.దుర్గా ఘాట్ వద్ద తనిఖీలు ప్రారంభించిన ఈఓ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మహిళా భక్తుల కోసం బట్టలు మార్చుకునే గదులను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన 'మన మిత్ర' వాట్సాప్ టికెట్ బుకింగ్ సేవలను పరిశీలించి భక్తులకు మరింత చేరువ చేయాలని చెప్పారు. కేశఖండన శాలను సందర్శించిన ఆయన సిబ్బంది హాజరు పట్టికలు, ఫిర్యాదుల రిజిస్టర్ను తనిఖీ చేశారు. బాత్రూమ్ల పరిశుభ్రతను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్బీఐ విరాళంగా అందించిన సిమెంట్ కుర్చీలపై కూర్చున్న భక్తులతో మాట్లాడి వసతులపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన షెడ్లు, విశ్రాంతి ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం కనకదుర్గ నగర్ ప్రాంతంలో కాలినడకన పర్యటించిన ఈఓ హాకర్ల నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రసాదం కౌంటర్ల వద్ద నిల్వలు, నాణ్యతను పరిశీలించి భక్తులకు నిరంతరాయంగా ప్రసాదాలు అందుబాటులో ఉండాలని సూచించారు.మహామండపం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన వాట్సాప్ బుకింగ్ కౌంటర్లను పరిశీలించిన ఆయన, పాత మెట్ల మార్గంలో భక్తులు నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలను వీక్షించారు. మెట్ల మార్గంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన సుమారు 800 ఇనుప కుర్చీలను తనిఖీ చేసిన ఈఓ, ప్రధాన ఆలయంలో శుక్రవారం దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడారు. క్యూ లైన్లలో త్రాగునీటి సరఫరా, ఇతర సౌకర్యాలను స్వయంగా పరిశీలించి ఎండ తీవ్రత వల్ల భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.దుర్గమ్మను దర్శించుకునే ప్రతి భక్తుడికి డిజిటల్ సేవలు, మెరుగైన మౌలిక వసతుల ద్వారా సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించడమే దేవస్థానం లక్ష్యమని ఈఓ వి.కె. సీనా నాయక్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవి, డీఈఈలు రవీంద్ర, అశోక్, ఏఈ మస్తాన్, ఏఈఓ తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



విజయవాడ సెంట్రల్ జూన్19 (మనం న్యూస్)॰ పేద కుటుంబాలకు వైద్య చికిత్సల భారం తగ్గించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలకంగా మారిందని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం 23, 26, 28, 36 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు రూ.6.73 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదలకు మెరుగైన వైద్య సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటికే అనేక మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని, భవిష్యత్తులోనూ అర్హులందరికీ ఈ సాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వీరమాచినేని లలిత, నెల్లి బండ్ల బాలస్వామి, వల్లభనేని సతీష్, మద్దినేని సుబ్రహ్మణ్యం, కటిక కోటి, చింత దుర్గారావు, నందేటి లక్ష్మీనారాయణ సింగ్, ఇమ్మిడి శ్రీరాంప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్తులను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు



గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 19( మనం న్యూస్ (ప్రతినిధి)॰ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా హైవేలపై నాటిన మొక్కలను మరియు నగర సుందరీకరణలో భాగంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలపై ఏర్పాటు చేసిన విలువైన ఫ్లవర్ పాట్స్ (పూల కుండీలను) కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాలలో ధ్వంసం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ ఆస్తులను, నగర సౌందర్యాన్ని పాడుచేయడం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని అందంగా, ఆహ్లాదకరంగా ఉంచేందుకు జీఎంసి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి సుందరీకరణ చేపడుతున్న మొక్కలను బాధ్యతారాహిత్యంగా ధ్వంసం చేస్తున్న వారిపై కఠినమైన చట్టపర చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటువంటి కార్యకలాపాలకు, సుందరీకరణ ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్న వ్యక్తులను నగర ప్రజలు ఎవరైనా గమనించినట్లయితే, వెంటనే గుంటూరు నగరపాలక సంస్థ ఉద్యానవన విభాగం సూపర్వైజర్ జాలాది విజయ్ కుమార్ (మొబైల్ నెంబర్: 9440931197) కి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. నిందితులపై సమాచారం అందిన వెంటనే సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసి భారీ జరిమానా విధించడం జరుగుతుందని, వారిచే నగరపాలక సంస్థకు చలానా కట్టించబడుతుందని తెలిపారు. ఒకవేళ నిర్ణీత సమయంలోగా చలానా కట్టని వారిపై మరియు ప్రభుత్వ ఆస్తులను నష్టపరిచిన వారిపై వాల్టా యాక్ట్ - 2002 (ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, చెట్ల చట్టం) నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి, తగిన న్యాయపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నగరాన్ని స్వచ్ఛంగా, పచ్చదనంతో ఉంచడం కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్క పౌరుని బాధ్యత అని పిలుపునిస్తూ, నగర సుందరీకరణను కాపాడుకోవడంలో ప్రజలందరూ నగరపాలక సంస్థకు పూర్తిగా సహకరించాలని కోరారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుంటుంది

▶▶ జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



గుంటూరు, జూన్ 19 : (మనం న్యూస్ ప్రతినిధి)ః ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని వి సీ హాల్లో జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల సమస్యల గురించి వివిధ ఉద్యోగ సంఘ నాయకులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా పలు ఉద్యోగ సంఘాలు వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడికి పంపి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి సమస్యకు నిర్దీత కాల పరిమితిని పెట్టుకొని, ఆయా శాఖల అధికారుల నుండి చర్యల నివేదికను తీసుకుంటామన్నారు. వ్యవస్థాగత లోపాలను సరిదిద్దేందుకు ప్రయత్నిస్తామన్నారు. పని ఒత్తిడి సహజంగానే అన్ని శాఖల్లో ఉంటుందని, అయితే ఒత్తిడిని జయించేందుకు ప్రయత్నిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ షేక్ ఖాజావలి, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు పనుల వేగావంతం చేయాలి



▶▶ ప్రతి విభాగం సమన్వయంతో కృషి చేయాలి

▶▶ పనులను త్వరితగతిన చేపట్టాలి

▶▶ నగర కమిషనర్

గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 19( మనం న్యూస్ ప్రతినిధి)ః శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు పనుల వేగావంతానికి ప్రతి విభాగం సమన్వయంతో కృషి చేయాలని, నిర్మాణ సంస్థ తగిన సిబ్బందిని కేటాయించుకొని పనులను త్వరితగతిన చేపట్టాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో జీఎంసి, ఆర్బి అధికారులు,నిర్మాణ కాంట్రాక్టర్ ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడం అధిక ప్రాధాన్యతగా ప్రతి శాఖ దృష్టి పెట్టాలన్నారు. అన్ని శాఖల నుండి నిర్మాణ పనులకు పూర్తి సహకారం ఉన్నందున పనులను వేగంగా చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు స్పష్టం చేశారు. భూ సేకరణ చట్టం మేరకు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓని ఆదేశించారు. కోర్ట్ కేసులు దాఖలు చేసిన వారికి అవగాహన కల్పించాలని పట్టణ ప్రణాళిక అధికారులను,నిర్మాణ పనులను దగ్గర ఉండి తగిన రక్షణ చర్యలు ఉండేలా పర్యవేక్షణ చేయాలని ఆర్బి అధికారులను ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారి అధికారులతో సమావేశమై, మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలోని కాకాని జంక్షన్ నుండి చిలకలూరిపేట జంక్షన్ వరకు ఇప్పటికే పలుమార్లు జిఎంసి సిబ్బంది చెత్త,వ్యర్ధాలు తొలగింపు చేపట్టారని, అది జాతీయ రహదారి పరిధిలోది కనుక ఇక నుండి వారే చేపట్టాలని స్పష్టం చేశారు. రహదారి వెంబడి డ్రైన్ క్లీనింగ్, సర్వీస్ రోడ్ లో పాట్ హోల్స్ మరమత్తులు ఎప్పటికప్పుడు చేయాలని ఆదేశించారు. అలాగే రోడ్ కి ఇరువైపులా పచ్చదనం పెంపుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు,సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి,ఏసిపి రెహ్మాన్, ఆర్బి డిఈఈ చెన్నయ్య, ఎన్హెచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్ఓబి నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటలో అందుబాటులోకి నిపుణులచే మెరుగైన వైద్య సేవలు




జగ్గయ్యపేట జూన్ 19 మనం న్యూస్ః ప్రతినెల మూడవ శుక్రవారం నిపుణులైన వైద్య సిబ్బందిచే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్ చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ వంశీ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వెంకట సన్నీ వైద్యశాలలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రతినెల మూడవ శుక్రవారం వైద్యశాలలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇటీవల తమ ఆధ్వర్యంలో మెదడు రక్తనాళం ఉబ్బరానికి సంబంధించిన అరుదైన ఆపరేషన్ నిర్వహించినట్లు డాక్టర్ వంశీ రెడ్డి తెలిపారు.భారీ మెదడు రక్తనాళ ఉబ్బరానికి అత్యవసర శస్త్రచికిత్స చేయటం ద్వారా ప్రాణాపాయం నుంచి 49 ఏళ్ల వ్యక్తి బయటపడినట్లు తెలిపారు.జీవితానికే ముప్పుగా మారిన భారీ మెదడు రక్తనాళ ఉబ్బరం పగిలిపోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న 49 ఏళ్ల వ్యక్తికి అత్యవసర మైక్రోసర్జికల్ క్లిప్పింగ్ శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా చికిత్స అందించినట్లు నిపుణులు వెల్లడించారు .శుక్రవారం జగ్గయ్యపేటలోని వెంకట సన్నీ హాస్పిటల్లో నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో హైదరాబాద్ మలక్పేట్కు చెందిన యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ వంశీ రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు .బ్రెయిన్ అన్యూరిజం పగిలిపోవడం న్యూరోసర్జరీలో అత్యంత ప్రమాదకరమైన అత్యవసర పరిస్థితుల్లో ఒకటని ఆయన తెలిపారు. అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, మెదడులో రక్తస్రావం, పక్షవాతం, కోమా లేదా మరణానికి కూడా ఇది దారితీసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.ఈ కేసులో అన్యూరిజం నుంచి పలు కీలక రక్తనాళాలు విడిపోవడంతో పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారిందన్నారు. సాధారణంగా ఉపయోగించే కాయిలింగ్, స్టెంటింగ్ వంటి ఎండోవాస్కులర్ చికిత్సలు ఈ రోగికి అనుకూలంగా లేవని వివరించారు.అలాంటి విధానాలను అమలు చేస్తే మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళాలు మూసుకుపోయే ప్రమాదం ఉండటంతో పక్షవాతం లేదా శాశ్వత న్యూరోలాజికల్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. దీంతో అత్యవసర మైక్రోసర్జికల్ క్లిప్పింగ్ శస్త్రచికిత్సను విజయ వంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. అలాగే ప్రతినెల మూడవ శుక్రవారం జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు నిపుణుల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి మార్కెటింగ్ విభాగం ఏజీఎం వెంకటేశ్వరరావు వీరంకి, మార్కెటింగ్ మేనేజర్ రెంటాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై వెలంపల్లి అవగాహన



విజయవాడ పశ్చిమ, జూన్ 19 (మనం న్యూస్)ః ఓటర్ల జాబితా సవరణ, ఇంటింటి సర్వే ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పశ్చిమ నియోజకవర్గం లోని పలు డివిజన్లలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. 34, 35, 41, 42, 44, 51, 56 డివిజన్లలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) ఇంటికి వచ్చినప్పుడు ఎన్యూమరేషన్ ఫారంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, పాస్పోర్టు సైజు ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. ఓటు హక్కును భద్రపరుచుకునేందుకు సర్వే ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. వైఎస్సార్సీపీ బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) దిశానిర్దేశం చేస్తూ, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చూడాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాల భర్తీ, పత్రాల సమర్పణలో సహకారం అందించాలని చెప్పారు. బీఎల్వోలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల నమోదు ప్రక్రియ సజావుగా జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



విజయవాడ సెంట్రల్ జూన్ 19 (మనం న్యూస్)ః లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్లో శుక్రవారం రక్తదాన శిబిరం, కేక్ కటింగ్ నిర్వహించారు. ఏపీసీసీ మానవ హక్కులు, ఆర్టీఐ, న్యాయ విభాగం చైర్మన్ వడ్డి సోమశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, యువత అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జె.డి.శీలం, మస్తాన్ వలీతో పాటు కొలనుకొండ శివాజీ, షేక్ ఖుర్షిదా, గడ్డం పాల్ విజయకుమార్, బొర్రా కిరణ్, నరహరిశెట్టి నరసింహారావు, అన్సారీ, పీటర్ జోసెఫ్, అల్లం రాజేష్, మండేపూడి సునీత తదితరులు పాల్గొన్నారు.

# మోదీ 12 ఏళ్ల పాలనపై ప్రదర్శన

విజయవాడ పశ్చిమ జూన్ 19 (మనం న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ రైల్వే స్టేషన్లో శుక్రవారం ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇన్చార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా ప్రారంభించారు. ప్రదర్శనలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, దేశ నిర్మాణంలో సాధించిన విజయాలను చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో షర్మిల, రహీం, దాసం సాయి, జ్యోతిర్మయి, శివలలిత, రత్నకుమారి, చైతన్య శర్మ, మనోజ్తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చిన్నారి వైద్యానికి రూ.4.20 లక్షల ఎల్ఓసీ అందజేత



విజయవాడ పశ్చిమ జూన్ 19 (మనం న్యూస్): మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.4.20 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ను శుక్రవారం ఎన్డీఏ కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబానికి అందజేశారు. 52వ డివిజన్ మల్లికార్జునపేటకు చెందిన జీ. జయలక్ష్మి కుమార్తె తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా, వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు.ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ఓసీని 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష, 52వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఈగల సాంబశివరావు కలిసి చిన్నారి తండ్రికి అందజేశారు. చిన్నారి ప్రస్తుతం ప్రత్యేక వైద్య చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన స్పందించి వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే సుజనా చౌదరికి చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ భద్రత అంశాలపై అవగాహన

- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమీక్ష
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు జూన్ 19 (మనం ప్రతినిధి): గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాఠశాలల భద్రత, విద్యార్థుల సంక్షేమం, మాదక ద్రవ్యాల నివారణ,ట్రాఫిక్ నిర్వహణ,సైబర్ నేరాల నివారణ,విద్యార్థినుల భద్రత మరియు పాఠశాలల వద్ద మౌలిక భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.పాఠశాలల భద్రత దృష్ట్యా ప్రతి విద్యాసంస్థలో సీసీటీవీ కెమెరాలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని,సందర్శకుల వివరాలు నమోదు చేసే విజిటర్ రిజిస్టర్ నిర్వహించాలని, భద్రతా సిబ్బందిని నియమించాలని సూచించారు. విద్యార్థుల రాకపోకలకు సంబంధించిన వివరాలను పర్యవేక్షించే వ్యవస్థ ఉండాలని తెలిపారు.విద్యార్థినుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ,స్కూల్ విడిచే సమయాల్లో అవసరమైన ప్రాంతాల్లో మహిళా పోలీసు సిబ్బందిని మోహరించడం,ఈవ్ టీజింగ్ మరియు వేధింపుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.మహిళా విద్యార్థులు, మహిళలు అందరూ తప్పనిసరిగా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలని సూచించారు.ట్రాఫిక్ నిర్వహణపై మాట్లాడుతూ, పాఠశాలల వద్ద విద్యార్థుల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్లు,హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్లు మరియు ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేయడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని తెలిపారు.డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా పాఠశాలలు చర్యలు తీసుకోవాలని కోరారు.స్కూల్ సమయాల్లో నెహ్రూనగర్ గేట్, కొత్తపేట-రెడ్డిపాలెం గేట్, మణిపాల్ బ్రిడ్జి,సత్యసాయి స్కూల్ మరియు కొండవీడు పబ్లిక్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉన్నట్లు యాజమాన్యాలు ఎస్పీ దృష్టికి తీసుకురాగా,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టి ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ,సోషల్ మీడియా,ఆన్లైన్ గేమింగ్,ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు,బ్యాంకింగ్ మోసాలు వంటి సైబర్ నేరాల పట్ల విద్యార్థులు,తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్లైన్కు ఫిర్యాదు చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు.అలాగే పాఠశాలల్లో తరచుగా యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాలు,గుడ్ టచ్-బ్యాడ్ టచ్ అవగాహన సదస్సులు, సైబర్ సేఫ్టీ వర్క్షాప్లు,ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ తరఫున వి. వెంకటేశ్వరరావు (కన్నా మాస్టారు), రవీందర్ బాబు తదితరులు పాఠశాలలకు సంబంధించిన సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం సమర్పించారు. ప్రైవేట్ పాఠశాలల్లో మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పాఠశాలల యాజమాన్యాలు మరియు పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్,డీఎస్పీ కార్యాలయాలను సంప్రదించాలని,పరిష్కారం కాని అంశాలను నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తో పాటు ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్,ఐ టీ కోర్ సీఐ నిస్సార్ బాషా ,జిల్లా పోలీస్ వెల్ఫేర్ విభాగ ఆర్ఐ శ్రీ సురేష్ ,ఐ టీ కోర్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్ , ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఓటు హక్కే లక్ష్యం



- 63వ డివిజన్లో ఇంటింటి ఓటరు ధృవీకరణ వేగవంతం

విజయవాడ సెంట్రల్, జూన్19 (మనం న్యూస్) విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు 63వ డివిజన్లో ఓటరు జాబితా ప్రత్యేక ఇంటింటి ధృవీకరణ కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ముమ్మరంగా నిర్వహించారు. డోర్ టు డోర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శిస్తూ అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించి నమోదు ప్రక్రియ చేపట్టారు.ఈ సందర్భంగా 63వ డివిజన్ బూత్ నంబర్-77 పరిధిలో నిర్వహించిన వెరిఫికేషన్ కార్యక్రమాన్ని టీడీపీ బూత్ ఇన్చార్జి కొండా పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన యువత, మహిళలు, కొత్తగా 18 ఏళ్లు నిండిన వారికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచనల మేరకు ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఓటరు జాబితా పటిష్టంగా ఉండేందుకు ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నిత్య అన్నదానానికి రూ.1 లక్ష విరాళం



విజయవాడ,ఇంద్రకీలాద్రి జూన్ 19 ( మనం న్యూస్): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి నిత్య అన్నదాన పథకానికి గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన పరుచూరి సాయి స్నేహ మరియు కుటుంబ సభ్యులు రూ.1,00,001 విరాళాన్ని సమర్పించారు. అమ్మవారిపై ఉన్న భక్తిశ్రద్ధలతో ఈ విరాళాన్ని అందజేసిన దాత కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవీ దర్శనం చేసుకున్నారు. అనంతరం నిత్య అన్నదాన విభాగం కోసం చెక్కును ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)కు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్ సమక్షంలో విరాళం స్వీకరణ జరిగింది. దాతల సేవాభావాన్ని ఆలయ అధికారులు అభినందిస్తూ, భక్తులు అందించే విరాళాలు నిత్య అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు.అమ్మవారి అనుగ్రహంతో సమాజ సేవా కార్యక్రమాల్లో మరింత మంది భక్తులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## మున్నలూరులో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



కంచికచర్ల,జూన్19(మనం న్యూస్): కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలో శుక్రవారం అధికారులు, కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు వివరించి అర్జీలు అందజేశారు.ప్రజల సమస్యలను క్షుణ్ణంగా విన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కొత్త పెన్షన్లు, గృహ నిర్మాణ పథకాల కోసం వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోందని, ప్రజా దర్బార్ కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగవంతంగా పరిష్కరిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో నిష్పక్షపాత విచారణ జరుగుతుంది

**ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను**



జగ్గయ్యపేట జూన్ 19 మనం న్యూస్ : జనసేన సానుభూతిపరులైన కుటుంబానికి చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం వ్యవహారం అత్యంత దురదృష్టకరమని, ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం మరియు జనసేన పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం పట్టణంలో పాత్రికేయులతో మాట్లాడుతూ సాయికృష్ణ అదృశ్యం ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అత్యంత సీరియస్గా ఉన్నారని తెలిపారు.ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కేసులో నిష్పక్షపాత విచారణ కోసం ప్రభుత్వం ఇప్పటికే రాజమండ్రి ఎస్పీ నరసింహ కిషోర్ ని ప్రత్యేక విచారణాధి కారిగా నియమించిం దన్నారు. ఒకవేళ సాయికృష్ణ లాకప్ డెత్కు గురైనట్లు తేలితే, బాధ్యులు ఎంతటి వారైనా వారిపై కఠినాతి కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు.సాయికృష్ణపై పలు కేసులు ఉన్నా, చట్టపరమైన ప్రక్రియ ద్వారానే శిక్షించాల్సి ఉంటుందని, చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకునే హక్కు లేదని స్పష్టం చేశారు. ఇదే కూటమి ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. అయితే ఈ దురదృష్టకర ఘటనను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం, కులాలకు ఆపాదించే ప్రయత్నాలు చేయడం బాధాకరమన్నారు. వైసీపీ నాయకులు పేర్ని నాని, అంబటి రాంబాబు చేస్తున్న వ్యాఖ్యల ను ఖండించిన ఆయన, గతంలో రాష్ట్రంలో జరిగిన కస్టోడియల్ డెత్లపై వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో 98 కస్టోడియల్ డెత్లు నమోదయ్యాయని, దీనికి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) గణాంకాలే సాక్ష్యమని సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మానవ హక్కుల గురించి మాట్లాడే ముందు వైసీపీ నాయకులు తమ పాలనలో జరిగిన ఘటనలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.

# ఎన్వీ రమణని కలిసిన ప్రభుత్వ విప్ సౌమ్య



**కీసర టోల్ ప్లాజా వద్ద శాలువాతో ఘన సన్మానం**

**న్యాయరంగానికి ఆయన సేవలు చిరస్మరణీయమని ప్రశంసలు.**

నందిగామ,జూన్19(మనం న్యూస్): భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ (ఎన్వీ రమణ)ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం నాడు నేషనల్ హైవే కీసర టోల్ ప్లాజా వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణకి శాలువాను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వారి చేతులకు అందజేశారు. భారత న్యాయ వ్యవస్థలో ఆయన విశిష్ట సేవలను అందించారని. జస్టిస్ రమణ నందిగామ నియోజకవర్గానికి చెందిన వారు కావడం నందిగామ నియోజకవర్గ ప్రజలు గర్వించదగిన విషయమని కొనియాడారు. న్యాయపరమైన విలువలను పరిరక్షించడంలో, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషి దేశానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.జస్టిస్ ఎన్వీ రమణ తో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించిన తంగిరాల సౌమ్య, ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

కంచికచర్ల,జూన్19(మనం న్యూస్): కంచికచర్ల మండలం : మున్నలూరు గ్రామంలో ఉన్న ఎస్డబ్ల్యూపిసి షెడ్డు ఆవరణలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు,అధికారులు, కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం తమ సామాజిక బాధ్యతగా భావించాలని ఆమె పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు సహకరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీఐ నాగరాజును వెంటనే అరెస్ట్ చేయాలి



**ఏపీఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు డిమాండ్**

గాంధీనగర్, జూన్ 19(మనం న్యూస్): కృష్ణలంక సిక్స్ టౌన్ సిఐ నాగరాజు వేధింపుల కారణంగానే తన కుమారుడు క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని, వెంటనే సదరు సిఐని కస్టడీలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అరెస్ట్ చేయాలని ఏపీఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సామాజిక ఉద్యమకారుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గాంధీనగర్ సమావేశం నిర్వహించారు.రౌడీ షీటర్లను ఇన్ఫార్మర్లుగా మార్చుకుని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకుంటున్న పోలీసులు, వారు చెప్పినట్లు వినకపోతే థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలీసుల బెదిరింపులు తాళలేక తన కుమారుడు క్రాంతి కుమార్ పురుగుల మందు తాగి మరణించాడని, మరణానికి ముందు పోలీసుల వేధింపులను, కులపరమైన దూషణలను వివరిస్తూ అతను తీసుకున్న సెల్ఫీ వీడియో ఆధారంగా ఈ విషయం బయటపడిందని ఆయన పేర్కొన్నారు. గతంలో సాయి కృష్ణ అనే యువకుడి లాకప్ డెత్కు కూడా ఇక్కడి పోలీసులే కారణమని ఆరోపించిన ఆయన, పోలీసులపై నమ్మకం కోల్పోయినందున తన కుమారుడికి న్యాయం జరిగే వరకు హైకోర్టు ద్వారా లేదా ప్రైవేటు కేసు వేసైనా పోరాడతానని స్పష్టం చేశారు. ఈ అమానుష ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి మరియు ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసిన ఆయన, తాను పోలీసులతో 10 లక్షల రూపాయలకు రాజీ పడ్డానని వస్తున్న వదంతులను తీవ్రంగా ఖండించారు.


# ఎరువుల యాప్‌ను రద్దు చేయాలి



వీరులపాడు జూన్ 19, మనం న్యూస్: ఎరువుల యాప్ని రద్దు చేయాలని కౌలు రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గురువారం రోజు జుజ్జూరు ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆందోళన చేయడం జరిగినది కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫేస్ ఆఫ్ ని రద్దు చేయాలని రైతులకి గతంలో లాగా పాత పద్ధతి ప్రకారం ఎరువులను అందించాలని భవిష్యత్తులో కొరత లేకుండా యూరియా డి ఏ పి 3 19 లో ఫాస్పేట్ ను తదితర ఎరువులను మార్కెట్లో ఆర్ఎస్కే ద్వారా కోపరేటివ్ సొసైటీలు వద్ద దారా అందరికీ అందుబాటులో ఉండాలని రైతు సంఘం కౌలుదారుల సంఘం డిమాండ్ చేసింది కేంద్ర ప్రభుత్వం ఫేస్ షాప్ ని తీసుకురావడం ద్వారా వ్యవసాయ రంగం నుండి రైతులను దూరం చేయడమే గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగానికి స్మార్ట్ ఫోన్లు లేవు సిగ్నల్స్ ఉండవు అనేక రకాలైనటువంటి ఇబ్బందులతో రైతుల్ని ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల్ని తగు చర్యలు తీసుకొని బ్లాక్ మార్కెట్ ని వారిపై కఠిన చర్యలు తీసుకొని సక్రమమైనటువంటి పద్ధతిలో ఎరువులు అందరికీ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నాం ఖరీఫ్ ప్రారంభమైన సందర్భంగా కల్తీ విత్తనాల్ని అరికట్టాలని కల్తీ నర్సరీలను ప్రభుత్వ అధికారులు గుర్తించి అంటేనే వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులందరికీ రుణాలు ఇచ్చి కవులు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలు ఇవ్వాలని ఈరోజు జుజ్జూరు మండల కేంద్రం వద్ద కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగినది ఈ ధర్నా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు చాట్ల రవి జుజ్జూరు కవులు రైతుల సంఘం మండల కార్యదర్శి. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ బాబు సిఐటియు కంచన్ చర్ల మండల కార్యదర్శి జి గోపి నాయక్ నన్నపనేని భాస్కర రావు మాదిరాజు వెంకటేశ్వరావు రంగారావు మల్లెల సుబ్బారావు రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు

# కాకాని వెంకటేశ్వరావు తల్లి లక్ష్మీ మృతి బాధకరం

పెనుగంచిప్రోలు, జూన్,19,మనం న్యూస్: నందిగామ, పెనుగంచిప్రోలు ఈనాడు రిపోర్టర్ కాకాని వెంకటేశ్వరావు తల్లి కాకాని లక్ష్మి శుక్రవారం సాయంత్రం స్వర్గస్తురాలు అయినారు.కాకాని లక్ష్మీ మృతి తీరని లోటని, బాధకరమైన విషయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని తెలియజేయుటకు చింతిస్తున్నాము. నేడు అనగా శనివారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని తెలియజేశారు.



# 4,26,969 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



- జిల్లా వ్యాప్తంగా సజావుగా సర్ ఇంటింటి సర్వే
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, జూన్, 19,(మనం ప్రతినిధి):** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ-సర్ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే సాఫీగా జరుగుతోందని.. ఇప్పటివరకు బీఎల్వోల ద్వారా 4,26,969 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 17,13,445 మంది ఓటర్లు ఉన్నారని.. బీఎల్వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించడంతో పాటు వాటిని నింపి తిరిగి ఇవ్వడంలో సహకరిస్తున్నారన్నారు. అదేవిధంగా 18,833 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిలా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో ఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు కీలకపాత్ర పోషించేలా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సగటున ఒక్కో బీఎల్వో పరిధిలో 956 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా జులై 14వ తేదీ వరకు బీఎల్వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందిస్తారని.. నింపిన వాటిని తిరిగి సేకరిస్తారని, ఇందుకు ప్రతి ఇంటికీ కనీసం మూడుసార్లు వెళ్లనున్నారని తెలిపారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనాలని, బూత్ స్థాయి అధికారులకు సహకరించాలని కోరారు.

# సర్ కార్యక్రమంలో ప్రతి ఓటరు పాల్గొనాలి

- ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి
- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం,జూన్,19,మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఖఐఖ) కార్యక్రమానికి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రతి ఓటరు ఖఐఖకార్యక్రమంలో పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 4.16 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే (హౌస్ టు హౌస్ సర్వే) నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.. అర్హుడైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండటం ఎంత ముఖ్యమో, నకిలీ ఓట్లు తొలగించడం కూడా అంతే అవసరమని అన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఖఐఖ) ద్వారా మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన ఓట్లు, అనర్హ నమోదులు వంటి వాటిని గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటర్ల జాబితా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని, ప్రజలు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. కొత్త ఓటర్లు, యువత, మహిళలు తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అవసరమైన సవరణలు, చిరునామా మార్పులు, కొత్త నమోదు వంటి అంశాలను ఈ అవకాశంలో పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని, పారదర్శకమైన ఎన్నికల కోసం అందరూ ఈ ఖఐఖ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

# ఆరు పోషకాలతో చర్మానికి సహజ నిగారింపు

**గాంధీనగర్, జూన్ 19 మనం న్యూస్:** చర్మానికి దీర్ఘకాలికంగా సహజ నిగారింపు, ఆరోగ్యకరమైన కాంతి రావాలంటే కేవలం స్కిన్కేర్ ఉత్పత్తులపై ఆధారపడకుండా, సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం అత్యంత ముఖ్యమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. మ్యాక్స్ హెల్త్కేర్ డైటెటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమాద్దర్ తెలిపిన వివరాల ప్రకారం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో విటమిన్ ఇ, విటమిన్ సి, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, జింక్, బీటా-కెరోటిన్, బయోటిన్ కీలక పాత్ర పోషిస్తాయి. విటమిన్ ఇ చర్మ కణాలను కాలుష్యం, సూర్యకిరణాల ప్రభావం నుంచి రక్షించడంలో సహాయపడుతుండగా, విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మాన్ని బిగుతుగా ఉంచుతుంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ చర్మంలో తేమను నిలుపుకోవడంలో తోడ్పడతాయి. జింక్ కణాల మరమ్మత్తుకు ఉపయోగపడటంతో పాటు మొటిమల సమస్యలను తగ్గించడంలో సహకరిస్తుంది. అలాగే బీటా-కెరోటిన్ చర్మ కణాల పునరుత్పత్తిని వేగవంతం చేసి ఆరోగ్యకరమైన ఛాయను అందిస్తే, బయోటిన్ చర్మాన్ని మృదువుగా, తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. బాదం, ఉసిరి, నారింజ, అవిసె గింజలు, శనగలు, క్యారెట్లు, చిలగడదుంపలు, గుడ్లు వంటి ఆహార పదార్థాల ద్వారా ఈ పోషకాలను సులభంగా



పొందవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఖరీదైన సౌందర్య ఉత్పత్తుల కంటే సమతుల్యమైన ఆహారపు అలవాట్లే ఆరోగ్యవంతమైన, సహజమైన చర్మ సౌందర్యానికి నిజమైన పునాది అని వారు సూచించారు.

# ఎస్పీని కలిసిన సిహెచ్. వెంకట సురేష్

**గుంటూరు జూన్ 19 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ సురేష్ , జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ఐపీస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.2009 బ్యాచ్కు చెందిన సిహెచ్ వెంకట సురేష్ గతంలో ఎస్ ఐ నగరంపాలెం,ఎస్ ఐ స్పెషల్ బ్రాంచ్ లో విధులు నిర్వహించారు. 2026 సంవత్సరంలో పదోన్నతి పొంది ఇన్స్పెక్టర్ నియమితులై నేడు గుంటూరులో స్పెషల్ బ్రాంచ్ విభాగం లో రిపోర్ట్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీస్ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్ , స్పెషల్ బ్రాంచ్ సీఐ 1 మల్లిఖార్జున రావు స్పెషల్ బ్రాంచ్ సీఐ 2 మల్లిఖార్జున రావు మరియు సిబ్బంది సిహెచ్ వెంకట సురేష్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. 2009 బ్యాచ్కు చెందిన సిహెచ్. వెంకట సురేష్ గతంలో ఎస్ ఐ నగరంపాలెం,ఎస్ ఐ స్పెషల్ బ్రాంచ్ లో విధులు నిర్వహించారు.2026 సంవత్సరంలో పదోన్నతి పొంది ఇన్స్పెక్టర్ నియమితులై నేడు గుంటూరులో స్పెషల్ బ్రాంచ్ విభాగం లో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీస్. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ సీఐ 1మల్లిఖార్జున రావు స్పెషల్ బ్రాంచ్ సీఐ 2 మల్లిఖార్జున రావు,సిబ్బంది సిహెచ్ వెంకట సురేష్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కూటమి లక్ష్యం



- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు: జూన్ 19 (మనంప్రతినిధి):** స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని ఎస్.కె.బి.యం.యం. హైస్కూల్లో ఎంపీలాడ్స్ నిధులతో నిర్మించబడిన అదనపు తరగతి గదులు మరియు ఐ.టి.సి.బంగారు భవిష్యత్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన డైనింగ్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్థానిక శాసన సభ్యురాలు శ్రీమతి గల్లా మాధవి తో కలిసి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం ఆయానిర్మానాలను ప్రారంభించారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో మమేకమై అనేక అంశాలను విద్యార్థులతో పెమ్మసాని మాట్లాడారు.పాఠశాల విద్యా విధానం, మౌలిక సదుపాయాల అంశాలను ఉపాధ్యాయులను, హెడ్మాస్టర్ ను అడిగి తెలుసుకున్నారు.అనంతరం విలేకరులతో పెమ్మసాని మాట్లాడుతూ.ఒక మధ్యతరగతి కుటుంబానికైనా, పేద కుటుంబానికైనా ప్రధానంగా మూడు అంశాలు భారంగా మారుతున్నాయి - విద్య, వైద్యం,సొంత ఇల్లు. అందులో విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి.ప్రభుత్వ పాఠశాలలు సమాజంలోని అన్ని వర్గాల జీవితాలను అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి.ఎస్ కె బి ఎం హైస్కూల్ 1966లో స్థాపించబడిన చారిత్రాత్మక విద్యాసంస్థ. ప్రస్తుతం 770 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. ఒకప్పుడు ఈ పాఠశాలలో రేకుల షెడ్లలో తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉండేది. విద్యార్థుల సంఖ్య పెరిగినా,అవసరమైన తరగతి గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.నాడు-నేడు కార్యక్రమంలో 10 గదులు నిర్మించినప్పటికీ, మరో 4 గదులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పలు పనులు కూడా పెండింగ్లో ఉండిపోయాయి.ఎంపీ - ఔఅృఖి నిధుల కింద రూ.45 లక్షలు మంజూరు చేసి, రూ.43.73 లక్షల వ్యయంతో 4 అదనపు తరగతి గదులు,హెడ్మాస్టర్ గది నిర్మాణాన్ని పూర్తి చేశాం.ఈ నాలుగు గదుల వల్ల సుమారు 160 మంది విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతోంది.ప్రస్తుతం పాఠశాలకు అవసరమైన 16 తరగతి గదుల్లో 14 గదులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఇది కీలక అడుగు. ఐటీసీ సంస్థ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాల్ ఒకేసారి 180 నుండి 200 మంది విద్యార్థులు భోజనం చేసే సౌకర్యాన్ని కల్పిస్తోంది. ప్రతి రోజు సుమారు 500 మంది విద్యార్థులకు ఇది ఉపయోగపడుతోంది. విద్యార్థులకు మంచి తరగతి గదులు, భద్రమైన పాఠశాల వాతావరణం, పరిశుభ్రమైన భోజన సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచడమే మా లక్ష్యం.ప్రభుత్వ నిధులు, ౹ఔఅృఖి, ఇఖిఖ దాతల సహకారం - ఇలా అందరి భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తాం.

# పాత్రికేయుడు కాకాని వెంకటేశ్వరరావును పరామర్శించిన సామినేని ఉదయభాను



**జగ్గయ్యపేట జూన్ 19 మనం న్యూస్:** జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులుఈనాడు విలేఖరి కాకాని వెంకటేశ్వరరావు మాతృమూర్తి మరణించారన్న విషయాన్ని తెలుసుకుని వారి స్వగృహంకు వెళ్ళి వారి భౌతిక కాయానికి ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనాడు పాత్రికేయులు వెంకటేశ్వరరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రముఖులు పాల్గొన్నారు



## ప్రతి ఒక్కరి జీవితాల్లో...

# యోగానందం

- మన యోగా నేడు విశ్వవ్యాప్తమవుతోంది.
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర దిశగా గొప్ప ముందడుగు
- ప్రభుత్వ ఉద్యోగుల థీమ్ యోగాకు విశేష స్పందన
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,జూన్,19,(మనం న్యూస్): ప్రతిఒక్కరి జీవితాల్లో సుసంపన్న ఆరోగ్యం, ఆనందాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున యోగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయని.. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర దిశగా లక్ష్యాల సాధనకు ఇవి గొప్ప ముందడుగు, పునాది అని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

యోగాంధ్ర-2026లో భాగంగా విజయవాడ అర్బన్ పరిధిలోని బీఆర్టీఎస్ రోడ్డులో శుక్రవారం జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగుల థీమ్ యోగా జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, వివిధ శాఖల ఉద్యోగులతో కలిసి యోగాసనాలను అభ్యసించారు. 45 నిమిషాల సరళ యోగా ప్రోటోకాల్ ప్రకారం ఆసనాలు వేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అన్ని వర్గాల జీవితాల్లోనూ యోగాను భాగం చేసేందుకు నిత్య యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. జిల్లా వ్యాప్తంగా ఊరూవాడా ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా వివిధ శాఖల ఉద్యోగులతో కలిసి యోగాసనాలు అభ్యసించడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

యోగాచరణతో ఉద్యోగుల్లో కార్యదక్షత: ఎ.విద్యాసాగర్, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు

ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడే సమగ్ర జీవన విధానమని వివరించారు. మన యోగా నేడు విశ్వవ్యాప్తమవుతోందని.. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ఆరోగ్యవంతమైన పౌర సమాజం కీలకమని, ఆ దిశగా యోగా ఒక గొప్ప సాధనమని పేర్కొన్నారు. ఉద్యోగులు నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించి, కార్యదక్షతను పెంపొందించుకోవచ్చన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి మందితో యోగా కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని.. ఇందులోనూ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొననున్నట్లు తెలిపారు. ఒక్క యోగానే కాకుండా సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన ప్రతి కార్యక్రమంలోనూ ఉద్యోగులు భాగస్వామ్యం కీలకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, జిల్లా ప్రెసిడెంట్ డీఎస్ఎన్ రెడ్డి, కార్యదర్శి పి.రమేష్, సిటీ ప్రెసిడెంట్ సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి నజీరుద్దీన్, క్యాపిటల్ సిటీ ప్రెసిడెంట్ నాగభూషణం, జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని, డీఎంహెచ్వో డా. ఇందుమతి, యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, డా. జె.సుమన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









# మాచర్లలో రెండేళ్ల విజయోత్సవం

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రసంగం



మాచర్ల, జూన్ 19: (మనం న్యూస్ ప్రతినిధి): పల్నాడు జిల్లా మాచర్లలో శుక్రవారం నిర్వహించిన రెండేళ్ల విజయోత్సవ సభలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కుటుంబం ఎన్నో పోరాటాలు చేసిందని, ఆ కుటుంబానికి గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. గత అరాచక పాలనను అంతమొందించా అని, ఉమ్మడి కూటమి ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధి పాలనను కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో ప్రజల్లో ఏర్పడిన నమ్మకం, జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే 2029 ఎన్నికల్లో కూటమిని మళ్లీ గెలిపిస్తాయని అన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం కూటమి నాయకులదే విజయం సాధిస్తారని అన్నారు.. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హ్యాట్రిక్ విజయం సాధిస్తారని,చంద్రబాబు నాయుడు ఐదోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆయన అన్నారు. ఈ విజయోత్సవ సభకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎమ్మెల్యే చదలవాడ 'ప్రజావేదిక'కు విశేష స్పందన



నరసరావుపేట, జూన్ 19: (మనం న్యూస్ ప్రతినిధి): నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తమ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు.నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 26 ఫిర్యాదులు అందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే అరవింద బాబు ప్రతి సమస్యను ఓపికగా విని తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ పింఛన్లు, రేషన్ కార్డు సమస్యలు, మురుగునీటి పారుదల,రోడ్ల మరమ్మతులు వంటి అంశాలపై ప్రజల నుంచి వినతులు అందాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని, పీజీఆర్ఎస్ ద్వారా ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అందిన ఫిర్యాదుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశాజ్యోతి సేవలకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రశంసలు



**హనుమాన్ జంక్షన్: జూన్ 19 ( మనం న్యూస్ ):** మేధో వికలాంగులు, శారీరక వికలాంగులు, అనాథ చిన్నారులకు సేవలందిస్తున్న ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీని ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను పరిశీలించిన వారు... సంస్థ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ కార్యదర్శి మాధవీలత సేవలను అభినందించారు.ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు అవసరమైన న్యాయ సహాయం, సంక్షేమ పథకాల అమలులో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీలో 66 మంది ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు అందుతున్న సంరక్షణ, సేవలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి, ఇగిఇ ఇంచార్జ్ చైర్మన్ వెంకటేశ్వర రావు, ృఇ్క్ష సూర్య చక్రవేణి లు పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో చిన్నారులకు కుటుంబ సభ్యుల్లా సేవలు అందిస్తున్న తీరును కొనియాడారు. సంస్థ కార్యదర్శి మాధవీలత చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. మేధో వికలాంగులు, ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు అవసరమైన న్యాయ సహాయం అందించడంతో పాటు, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆధార్ కార్డులు తదితర సౌకర్యాలు అందేలా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# నీట్ రీ-ఎగ్జామినేషన్కు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**మచిలీపట్నం: జూన్ 19 మనం న్యూస్:** నీట్ (యూజీ) రీ-ఎగ్జామినేషన్-2026 నిర్వహణకు సంబంధించి కృష్ణా జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు నీట్ (యూజీ) రీ-ఎగ్జామినేషన్ ఈ నెల 21వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించేందుకు జూన్ 20, 21 తేదీల్లో కలెక్టరేట్లో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని కలెక్టర్ వెల్లడించారు. కంట్రోల్ రూమ్కు 08672-252399 ఫోన్ నంబర్ కేటాయించారు. జూన్ 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, జూన్ 21న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.నీట్ రీ-ఎగ్జామినేషన్కు సంబంధించి ఏవైనా సమాచారం, సమస్యలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే కంట్రోల్ రూమ్ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



# పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి.. సిబ్బందికి సూచనలు



**మచిలీపట్నం, జూన్ 19 మనం న్యూస్:** ప్రభుత్వ ఆసుపత్రిలో( ఆర్ఎంఓ )గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ భానుమూర్తి ఆసుపత్రిలోని అన్ని విభాగాల పనితీరును పరిశీలిస్తూ పర్యవేక్షణను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో సానిటేషన్, పరిశుభ్రత నిర్వహణపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.ఆసుపత్రిలోని వివిధ వార్డులు, ఓపీ విభాగం, ప్రాంగణం తదితర ప్రాంతాలను సందర్శించిన డాక్టర్ భానుమూర్తి పరిశుభ్రత పనుల తీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేస్తూ ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, పరిశుభ్రత పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందించడమే ఆసుపత్రి ప్రధాన లక్ష్యమని డాక్టర్ భానుమూర్తి తెలిపారు. సానిటేషన్ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

**గుంటూరు, జూన్ 19: (మనం న్యూస్ ప్రతినిధి)** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహేచ్ ) నూతన సూపరింటెండెంట్గా నియమితులైన డాక్టర్ జి.దుర్గా ప్రసాద్ శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆసుపత్రి అభివృద్ధి మరియు రోగుల సేవలను మెరుగుపరచడం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూపరింటెండెంట్ కు సూచించడం జరిగింది.



# యువత, మహిళల స్వయం ఉపాధికి బ్యాంకులు సహకరించాలి

## యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్తో ఎంపీ బాలశౌరి భేటీ

**మచిలీపట్నం: జూన్ 19 మనం న్యూస్:** యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ . జోగారావు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిని కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మచిలీపట్నంలో నిర్మించనున్న డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీ బాలశౌరి సూచించారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో యువత, మహిళలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించడంలో బ్యాంకింగ్ రంగం మరింత చురుకైన పాత్ర పోషించాలని కోరారు.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు (ఎంఎస్ఎంఈ) ప్రారంభించాలనుకునే వారికి రుణాల మంజూరులో సౌలభ్యం కల్పించాలని సూచించారు. అలాగే గేదెల పెంపకం, గొర్రెల పెంపకం, నాటు కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తి, పాడి పరిశ్రమ, మత్స్యరంగం వంటి గ్రామీణ ఆధారిత ఉపాధి రంగాలకు మరింత విస్తృతంగా రుణ సదుపాయాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవుట్రీచ్ కార్యక్రమాలను త్వరలో నిర్వహించాలని రీజినల్ హెడ్ను ఎంపీ బాలశౌరి కోరారు.



# రోడ్, డ్రైన్లు, ఫుట్ పాత్ ల ఆక్రమణలు తొలగింపుపై స్పెషల్ డ్రైవ్..కమిషనర్

**గుంటూరు నగర పాలక సంస్థ జూన్ 19 (మనం న్యూస్ ప్రతినిధి):** రోడ్, డ్రైన్లు, ఫుట్ పాత్ ల ఆక్రమణలు తొలగింపుపై స్పెషల్ డ్రైవ్..కమిషనర్ మయూర్ అశోక్.గుంటూరు నగరంలో ప్రజా సౌకర్యార్థం ప్రధాన రోడ్లు,డ్రైన్లు, ఫుట్ పాత్ లపై ఆక్రమణల తొలగింపు చేపట్టామని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే తొలగింపులో జరిగే నష్టానికి వారే భాధ్యత వహించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు.శుక్రవారం కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు నగరంలోని అమరావతి రోడ్,ఎన్ఆర్టీ రోడ్ ల్లోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య, వర్షాల వలన వచ్చే నీరు ఆక్రమణల కారణంగా డ్రైన్లలోకి వెళ్లడానికి వీలు లేక రోడ్ల మీద ఉంటుందన్న వివిధ ప్రజా సంఘాలు, ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు ప్రధాన రోడ్లు, డ్రైన్ల మీద ఆక్రమణల తొలగింపు చేపట్టామనన్నారు. ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, తొలగించుకోని వాటిని నగరపాలక సంస్థ అక్రమ ఆక్రమణల నిర్మూలణ దళం తొలగిస్తుందన్నారు. ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియగా చేపట్టాలని, తొలగించిన వాటి వివరాలను రోజువారీ నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశామన్నారు. ప్రజా సౌకర్యార్థం ఆక్రమణదారులు నగరపాలక సంస్థకు సహకరించి, ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు.




# సమస్యల పరిష్కార సాధన కోసమే మీకోసం



జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం నవీన్

**పామర్రు, జూన్ 20: (మనం న్యూస్ ):**సమస్యల పరిష్కార సాధన కోసమే మీకోసం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. శుక్రవారం నియోజవర్గ కేంద్రమైన పామర్రు పట్టణంలోని ఆరేపల్లి కళ్యాణి మండలం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అధ్యక్షతన నిర్వహించారు. నియోజవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కారం కోసం అర్జీలను సమర్పించారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డిఓ కరుణకుమారి, డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్కుమారి, డి.ఎస్.పి పాల శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య రేపు వీరులపాడు పర్యటన

**వీరులపాడు జూన్ 19, మనం న్యూస్:** రేపు తేదీ : 20-06-2026 శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య వీరులపాడు మండల పర్యటన వివరములు : సాయంత్రం 4:00 గంటలకు కొణతాలపల్లి నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం..5:00 గంటలకు జయంతి ఎర్రుపాలెం నూతన బీటి రోడ్ ప్రారంభోత్సవం. 6 గంటలకు తిమ్మాపురం నూతన అంగన్వాడి కేంద్రం ప్రారంభోత్సవం. ఈ కార్యక్రమాలకు కూటమి నేతలు, తెదేపా నేతలు కార్యకర్తలు అభిమానులు సానుభూతిపరులు అందరూ కార్యక్రమంలో పాల్గొనగలరని తెలుగుదేశం వీరులపాడు మండలం నాయకులు . కొండ్రగుంట శ్రీనివాస్ ఒక ప్రకటన లో తెలియచేసినారు

# ఏపీ-ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా, డి ఏ పి పంపిణీ



**గుంటూరు, జూన్ 19 :( మనం న్యూస్ ప్రతినిధి) ః**యూరియా, డి.ఏ.పి ఎరువులను ఏపీ-ఎయిమ్స్ (ౠఅఐక్షి) యాప్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 - 27 సంవత్సరం నుండి యూరియా, డి ఏ పి ఎరువులను ఏపీ-ఎయిమ్స్ అను యాప్ ద్వారా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు,గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా యాప్ ను ప్రవేశ పెట్టడమే కాకుండా జూన్ 8వ తేదీ నుండి ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకువచ్చిందని చెప్పారు. అపోహలు సరిదిద్దడానికి, పంట వేసే రైతుకు మాత్రమే ఎరువుల అందడానికి, బ్లాక్ మార్కెటింగ్, హోర్డింగ్ డైవర్షన్,అధిక ధరలకు విక్రయించే పాత వ్యవస్థను కట్టడి చేయడం ఈ నూతన వ్యవస్థ ద్వారా వీలుకలుగుతుందన్నారు. ఈ నూతన విధానంలో యూరియా, డి.ఏ.పి ఎరువులు పంట వేసిన రైతులకు మాత్రమే అందాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇందుకు సంబంధించి జూన్ మొదటి వారం నుండి విస్తృతమైన కసరత్తును వ్యవసాయ శాఖ చేపట్టిందని అన్నారు.ఇందుకు రైతు సేవా కేంద్రాలను రెవిన్యూ గ్రామంతో అనుసంధానం చేయడం జరిగిందని, రెవిన్యూ గ్రామంలో ఉన్న రైతుల అందరి వివరాలు,2025 ఖరీఫ్ కాలంలో వారు సాగు చేసిన పంటల వివరాలు,రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సరిపోల్చు నిమిత్తం ఏపీ - ఎయిమ్స్ యాప్ లో అందుబాటులోకి తేవడం జరిగిందని వివరించారు. రైతుల వివరాలను రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ / ఉద్యానవన సహాయకులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి వారు వేసిన పంటల వివరాలు ఏపీ - ఎయిమ్స్ యాప్ లో అందుబాటులో ఉన్న వివరాలతో సరిపోల్చి లేదా రైతులు తెలిపిన వివరాలతో సరిచేసి వాటిని ఆమోదించడం జరుగుతుందని చెప్పారు. తద్వారా రైతులకు వారు వేసే పంటలు, కావలసిన యూరియా,డి.ఏ.పి ఎరువులు జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలు,సొసైటీలు, ప్రైవేటు డీలర్ల ద్వారా కొనుగోలు చేయడానికి అనుసంధానం చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ విధానంలో జిల్లాలోని రైతులకు ఇప్పటికీ ఖరీఫ్ పంటకాలానికి సాగు చేసే పంటకు కావలసిన ఎరువులు వారు సాగుచేసిన పంట, విస్తీర్ణాన్ని ఆధారంగా వ్యవసాయ శాస్త్రవేత్తల ఎరువుల సిఫార్సుల అనుగుణంగా కొనుగోలు చేయవచ్చన్నారు. పంట కాలం మొత్తానికి కావలసిన ఎరువులు మూడు దఫాలుగా పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు. వివరాలు సరిచూసుకోండి,రైతులు ఎరువులు కొనుగోలు నిమిత్తం పంట భూమి వివరాలు, సాగు చేసే పంటల వివరాలు ఆయా రైతు సేవా కేంద్రాలలో సర్వే నెంబరు, ఖాతా నెంబరు, విస్తీర్ణం, పంట సరిగా ఉన్నట్లు రైతు సేవ కేంద్రం సహాయకుల ద్వారా సరిచూసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలలో వివరాలు తప్పుగా ఉంటే మార్పించుకొనుటకు అవకాశం ఉందని చెప్పారు. వివరాలు సరిచేసుకోకుండా యాప్ ద్వారా కొనుగోలు చేసిన తర్వాత వివరాల మార్పు సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ విధానంలో జిల్లాలో సాగయ్యే అన్ని పంటలు,వాటి విస్తీర్ణం ఆధారంగా ఎంత ఎరువులు కావాలో ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకుని వాటిని ముందుగానే వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచుతుందన్నారు.15 రోజుల వ్యవధితో యూరియా, డిఏపిలు ఎరువులను మూడు దఫాలుగాకొనుగోలు చేయవచ్చన్నారు. కాంప్లెక్స్ ఎరువుల విషయంలో ఎటువంటి నమోదు లేకుండా రైతులు నేరుగా డీలర్ వద్ద కొనుగోలు చేయవచ్చని చెప్పారు.ఈ విధానం ద్వారా రైతులకు సకాలంలో వారు వేసిన పంటలకు శాస్త్రవేత్తల సిఫారసులు అనుగుణంగా యూరియా,డిఏపి ఇవ్వడం జరుగుతోందన్నారు. సందేహాలకు,వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు పొందవచ్చని,స్థానికంగా ఏర్పడే సమస్యలను రాష్ట్ర వ్యవసాయ శాఖ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 155251కు గాని లేదా స్థానిక వ్యవసాయ అధికారిని గాని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 12,891 టన్నుల యూరియా, 4,158 టన్నుల డిఎపి అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో వేయబోయే పంటలకు ఆగస్టు రెండవ వారం వరకు సరిపోతుందని వివరించారు. అనవసరమైన, అవాస్తవమైన ప్రచారాలు నమ్మవ ద్దు. అనవసర మైన,అవాస్తవమైన ప్రచారాలు నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన విధానాన్ని తప్పుగా భావించి ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఎపి ఎరువులు అందవేమో అని అపోహకు గురికావలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. గత సంవత్సరం రైతులు అపోహలకు గురై అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయుటకు ప్రయత్నించారని అన్నారు. రైతులకు అవసరమైన అన్ని ఎరువులు సకాలంలో రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా అందించుటకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. సకాలంలో ఎరువులు సక్రమంగా పంపిణీ చేయడానికి రైతులు జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలని కోరారు.స్థానిక వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వడం ద్వారా త్వరితగతిన ఎరువులు పొందవచ్చని గమనించాలని సూచించారు.

# నందనవనానికి డిప్యూటీ సీఎం శ్రీకారం





**తాడేపల్లి, జూన్ 19, మనం న్యూస్ః** అటవీ, పర్యావరణ శాఖల పరిపాలన, పర్యవేక్షణ కార్యాలయం అరణ్యారామానికి భూమి పూజ చేసిన అనంతరం అటవీ పర్యావరణ శాఖల మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరో అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాడేపల్లి మండల పరిధిలోని బ్రహ్మానందపురంలో నందనవనం పేరిట మైనింగ్ తో పర్యావరణ విధ్వంసం జరిగిన ప్రాంతంలో ప్రకృతికి పునరుజ్జీవం పోసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశ వాళీ మర్రి మొక్కను నాటి నందనవనానికి తిరిగి ప్రాణం పోశారు. 2013 నుంచి ఆ ప్రాంతంలో చేపట్టిన మైనింగ్ కార్యకలాపాలు సహజ సిద్ధమైన కొండ భాగం, అటవీ భాగం తీవ్రంగా క్షీణించింది. విచ్చలవిడిగా పర్యావరణ విధ్వంసం జరిగింది. ఆ ప్రాంతంలో ప్రకృతిని పునరుజ్జీవింప చేసే బృహత్తర కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మొదలుపెట్టారు. మైనింగ్ కారణంగా క్షీణించిన అటవీ భాగంలో పచ్చదనాన్ని పునఃస్థాపన దిశగా చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమంగా నందనవనం నిలువనుంది. అక్రమ మైనింగ్ తో ధ్వంసం అయిన ఈ ప్రాంతం మొత్తం మొక్కలతో నిండి నందనవనంగా రూపాంతరం చెందాలన్న సంకల్పంతో మర్రి మొక్కను నాటారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రకృతి వనరుల పునరుద్ధరణ ద్వారా భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, వనరులతో కూడిన వాతారణాన్ని అందించాలన్న లక్ష్యంతో నందనవనం కాన్సెప్ట్ ముందుకు తీసుకువెళ్తున్నట్టు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, అటవీ శాఖ పీసీసీఎఫ్ పి వి చలపతి రావు, రాష్ట్ర మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి కృష్ణయ్య, బయో డైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, అటవీశాఖ ఐటీ సలహాదారు శ్రీ పి.నాగబాబు, అప్కాస్ట్ మెంబర్ సెక్రటరీ శరత్, అటవీ శాఖ ఉన్నతాధికారులు రేవతి, రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్ తో పాటు ఇతర అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ తనిఖీలు



**మైలవరం జూన్ 19 మనం న్యూస్ః** 82 - స్థానిక నియోజకవర్గ పరిధిలో జరుగుచున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ (ఎస్ ఐ ఆర్ )-2026 కార్యక్రమములో భాగంగా, 82 - నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మరియు జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ, విజయవాడ వారు మైలవరం గ్రామములో ఇంటింటికి ఓటర్ల ఎన్యూమ రేషన్ ఫారముల పంపిణీ కార్యక్రమము నిర్వహణ తీరును ఆకస్మికంగా పరిశీలించుటకు క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామము లోని పోలింగ్ కేంద్రం నెం.102 మరియు పోలింగ్ కేంద్రం నెం.105 లను సందర్శించి, ఎన్యూమరేషన్ ఫారముల పంపిణీ మరియు సేకరణ ప్రక్రియను సమీక్షించారు. అనంతరం సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు (బి ఎల్ ఓ లు ), సూపర్వైజర్లకు మరియు బూత్ లెవెల్ ఏజెంట్లకు (బి ఎల్ ఎ లు ) పలు సూచనలు జారీ చేశారు. ఎన్యూమరేషన్ ఫారముల పంపిణీ కార్యక్రమ మును త్వరిత గతిన పూర్తి చేయుట తో పాటు, పంపిణీ చేసిన ఫారములను ఓటర్ల నుండి సకాలములో సేకరించి, సంబంధిత వివరాలను బూత్ లెవెల్ అధికారుల ఎన్నికల యాప్లో నమోదు చేయించ వలసింది గా ఆదేశించారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ కార్యక్రమమును నిబంధన లకు అనుగుణంగా, పారదర్శకంగా మరియు సమయ పాలనతో నిర్వహించుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# ప్రజల పట్ల మర్యాదపూర్వక వైఖరి తప్పనిసరి



**తాడేపల్లి, జూన్ 19, మనం న్యూస్ః** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా శుక్రవారం తాడేపల్లి-ఉండవల్లి సెంటర్ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి కార్యాలయ పనితీరు, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ మరియు ప్రజా సేవల అమలును సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవలే సచివాలయాల పనితీరు ప్రమాణంగా ఉండాలని స్పష్టం చేశారు. అన్ని రిజిస్టర్లు, హాజరు పట్టికలు, ఫిర్యాదుల నమోదు పుస్తకాలు తదితర రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా అప్డేట్ చేయాలని సూచించారు.కార్యాలయాల్లో సేవలు నిర్ణీత సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని, రికార్డుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని ఆయన ఆదేశించారు. సచివాలయ ప్రాంగణం, కార్యాలయ గదులు పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను క్రమబద్ధంగా భద్రపరచాలని సూచించారు.అలాగే కార్యాలయ సమయాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి హితవు పలికారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా ప్రతి సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని కమిషనర్ అలీమ్ బాషా పేర్కొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**తాడేపల్లి, జూన్ 19, మనం న్యూస్ః** అనారోగ్యంతో బాధపడుతున్న వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను మంత్రి నారా లోకేష్ చొరవతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు శుక్రవారం పంపిణీ చేశారు. తాడేపల్లి 9 వ వార్డ్ కి చెందిన కగ్గరాజు లక్ష్మి కి 28,400/- వేలు,10 వ వార్డ్ కి చెందిన శిఖరం బాబుకి 59,995/- వేలు,14 వ వార్డ్ కి చెందిన మన్నేపల్లి ఎలిజిబెత్ కి 31,984/- వేలు,బూదాల జాన్సన్ కి 32,100/- వేలు,కొండ కాయల ప్రమీల కి 41,729/- వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వెంకట్రావు అందజేశారు. సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్ కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆకస్మికంగా తనిఖీలు

**జగ్గయ్యపేట జూన్ 19 మనం న్యూస్ ః** శుక్రవారం జగ్గయ్యపేట మండల తాసిల్దార్ ఎస్ శిరీష ఆకస్మికంగా పలు ప్రాంతాల్లో తనిఖీలను నిర్వహించారు మందుల అమ్మకాలు కు సంబంధించిన పుస్తకాలను పరిశీలించారు .కాలం చెల్లిన మందులను అలానే ప్రభుత్వం నిషేధించిన మందులను విక్రయించవద్దని హెచ్చరించారు.



# నివాళులు అర్పించిన తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట జూన్ 19 మనం న్యూస్ః** జగ్గయ్యపేట నియోజకవర్గం, వత్సవాయి మండలం, చిట్యాల గ్రామం నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారెళ్ల పుల్లారెడ్డి మాతృమూర్తి సూరమ్మ దశ -దిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి స్థానిక నాయకులు లతో కలిసి జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పూలమా లలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం, మండలం, గ్రామ, నాయకులు పాల్గొన్నారు.